పోరంబోకు కబ్జా


ఆక్రమిత అటవీ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు


జేసీబీతో మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

కలువాయి(సైదాపురం): అధికారమే అండగా కూటమి పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. కంటికి కనిపించిన ఇసుకనూ, మట్టినీ వదల్లేదు. ఇప్పుడు చెరువులు, అటవీ, పోరంబోకు భూములనూ కబ్జా చేసేస్తున్నారు. తాజాగా కలువాయి మండలం 598 సర్వే నెంబర్‌లోని కుల్లూరు ఎర్ర చెరువును ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్టు భూములను సైతం దాదాపు 20 ఎకరాలను మంగళవారం దర్జాగా కబ్జా చేసి చదును చేశారు. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకుని గ్రామ రెవెన్యూ అధికారి సహకారంతో దర్జాగా ఎర్ర చెరువు పోరంబోకు, రిజర్వ్ ఫారెస్టు భూములను చదును చేసి చుట్టూ కంచె కూడా వేశారు. ఈ విషయంపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు తన సిబ్బందితోకలసి అక్కడ జరిగే పనులను అడ్డుకున్నారు. ఘటన స్థలం నుంచి ఫారెస్టు అధికారులకు ఇన్‌చార్జి తహసీల్దార్ ఫోన్‌చేయగా వారు ఫోన్ స్విచాఫ్ ఆఫ్ చేసుకుని ఉండడం గమనార్హం. దీన్ని బట్టి అటవీ శాఖ అధికారుల హస్తం కూడా గ్రామస్తులు భావిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఎవరికీ తెలియకుండా బ్రాహ్మణపల్లి, వెంకటరెడ్డిపల్లి రిజర్వ్‌డ్ ఫారెస్టులో 20 ఎకరాల భూమిని చదువు చేయడాన్ని చూసి రెవెన్యూ అధికారులు అవాక్కయారు. గ్రామ రెవన్యూ అధికారి గ్రామంలోకి వచ్చినప్పటి నుంచి ఇటీవల కుల్లూరు గ్రామంలో భూ ఆక్రమణలు పెరిగిపోయాయిని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల ఎర్ర చెరువు అలుగు ప్రాంతాన్ని ఆక్రమిస్తున్న విషయంపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆర్డీవో పావని స్పందించి పనులు వెంటనే ఆపాలని అప్పటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మళ్లీ కూటమి నాయకులు భూములు చదునుచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందరికీ తెలిసే ప్రదేశం కాదు కాబట్టి గుట్టు చప్పుడు కాకుండా మూడు రోజుల నుంచి పనులు చకచకా చేసేస్తున్నారు. రిజర్వ్‌ఫారెస్టు చెరువు పోరంబోకు పొలాల్లో ఆక్రమణలు చేపడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు వారిని హెచ్చరించారు.

మన మిత్ర యాప్‌ను వినియోగించుకోండి


ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మేనేజర్ తదితరులు

నాయుడుపేటటౌన్ : మన మిత్ర యాప్‌కు సంబంధించిన వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కోరారు. మన మిత్ర యాప్‌కు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం పట్టణంలో సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు తదితరులతో కలిసి ర్యాలీ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బజారు వీధులు, గడియారం సెంటర్ మీదుగా గాంధీపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఊరు కుందుమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు అవసరం


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సైదాపురం: రైతులు తాము సాగు చేసే పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో హైమావతి కోరారు. మండలంలోని చాగణం గ్రామంలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందాలన్నారు. తప్పనిసరిగా వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలను పాటించడంతోపాటు విచ్చలవిడిగా పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని ఆమె కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


మాట్లాడుతున్న వైద్యాధికారిణి శ్రావణి

సైదాపురం : వ్యాధి నిరోధిక టీకాలను నూరు శాతం తప్పకుండా వేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ బి శ్రావణి కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 12న నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ స్రాక్రాయల శెట్టి, సూపర్‌వైజర్ పద్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ను 1బీకి లింక్ చేయాలి

దక్కిలి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఎవరైనా ఉండి నగదు జమ కాకుండా ఉంటే తమ ఆధార్ కార్డు నంబర్‌ను 1బీకి లింక్ చేసుకుని ఆయా రైతు సేవా కేంద్రాల్లో వీఏఓలు దగ్గర గ్రీవెన్స్ మాడ్యూల్‌లో నమోదు చేసుకుంటే రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతుందని వ్యవసాయ శాఖ అధికారిణి శిరిషా మంగళవారం తెలిపారు. ఎన్‌పీసీఐ లింక్ కూడా తప్పనిసరిగా చేసుకోవలన్నారు.

'మన మిత్ర'పై అవగాహన


ర్యాలీ చేస్తున్న అధికారులు

చిట్టమూరు: ప్రభుత్వ సేవలను మనమిత్ర యాప్ ద్వారా పొందవచ్చని ఎంపీడీఓ మనోహర్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం యాప్ ఉపయోగాలు తెలియజేస్తూ చిట్టమూరు నుంచి కొత్తగుంట గ్రామం వరకు అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్ గౌడ్, చిట్టమూరు ఎస్ఐ చిన్నబలరామయ్య, చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యుడు సుఖేంద్ర, ఏపీఎం గున్నయ్య, ఏపీఓ షీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

గూడూరురూరల్ : పట్టణంలోని శ్రీకల్యాణ వీరభద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది దివ్యాంగులకు ఫలసరుకులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రోహిణి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు మాధురి, కార్యదర్శి లక్ష్మీ స్నేహలత, పవిత్ర, రెడ్ సంస్థ సభ్యులు పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

అక్రిడిటేషన్లు వెంటనే ఇవ్వాలి

చిల్లకూరు: అర్హత కలిగిన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్‌లు ఇవ్వాలని పలువురు పాత్రికేయులు గూడూరు తహసీల్దార్ వెంకటప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. గూడూరు రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం పలు పత్రిక, ఎల్రక్టానిక్ మీడియా విలేకర్లు ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

దరఖాస్తు చేసుకోండి

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో దాసరిపల్లి (బీసీ), కలువాయి నడిమి వీధి(ఓసీ), కనకమహల్ (బీసీడి), ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని రాపూరు సీడీపీఓ సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వివాహితులు అయి రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

చికెన్ ధరలు		06.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	222
లేయర్ చికెన్	:	190

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


అనంతమడుగులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


సూళ్లూరుపేట: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ


రాపూరు: అవగాహన కల్పిస్తున్న అధికారులు


తల్లిపాల వారోత్సవాల్లో అధికారులు

సైదాపురం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తని పెంచుతాయని రాపూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునంద అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అనంతమడుగులో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, పద్మప్రియ, పుల్లమ్మ, భవాని, రమాదేవి, సుజాత, మహిళా పోలీసు ఉషారాణి పాల్గొన్నారు.

తల్లి పాలే పిల్లలకు ఆరోగ్యం

సూళ్లూరుపేట రూరల్ : పిల్లల్లో ఎదుగుదల ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు ఎంతో మంచిదని అంగన్‌వాడీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మన్నేముత్తేరి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

రాపూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రాధిక, సౌజన్య అన్నారు. రాపూరు మండలంలోని రాపూరు, తాతిపల్లి గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల బిడ్డకు శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. తల్లిపాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, బిడ్డలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలువాయి(సైదాపురం): మండలంలోని చింతలాత్మకూరు, తోపుగుంట అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితాకుమారి, అరుణ, రమణమ్మ, హైమా పాల్గొన్నారు.

చిల్లకూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల బిడ్డకు అమృతం ఇచ్చినట్లు అవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ సూచించారు. మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయితీ పరిధిలోని గుమ్మళ్ళదిబ్బ -2లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, వెంకటరమణమ్మ, సరోజిని, సుబ్బరామమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటటౌన్: తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత ఆధ్వర్యంలో చలివేంద్రం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు.

మినీ గురుకులంలో మెగా వైద్య శిబిరం


విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఎస్టీ బాలికల మినీ గురుకులంలో మంగళవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రోహిణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్యశ్రీ, దంత వైద్యులు డాక్టర్ నారాయణ, గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తి నారా, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ త్రివిక్రమ్ రావు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్లు యల్లసిరి గోపాల్‌రెడ్డి, వాసుగౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్‌కుమార్‌రెడ్డి, ధనంజయరెడ్డి, నాసిన నాగులు, రవీంద్రనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సిద్దారెడ్డి, లక్ష్మీ నారాయణ, కృష్ణంరాజు, నవీన్ జయకుమార్, హెచ్.ఎం మేరి పాల్గొన్నారు.

నకిలీ మస్టర్లకు చెక్


మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి ఈ నెల 10వ తేదీ నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రావు తెలిపారు. గూడూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ మస్టర్లు నమోదు చేస్తున్నారనే విమర్శల నేపథ్యంలో నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానం అమల్లోకి తెచ్చినప్పటికీ నకిలీ మస్టర్లు వెలుగులోకి వస్తూనే ఉన్నాయన్నారు. వీటన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గూడూరు ఏపీఓ పెంచలయ్య పాల్గొన్నారు.

అసోం వాసి మృతి


యువకుడి మృతదేహం

చిల్లకూరు: గూడూరు రైల్వే స్టేషన్ మొదటి గేట్ ఆర్చ్ వద్ద అసోం రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. అసోంకు చెందిన రూపక్‌రాయ్(23) గేట్ వద్ద ఉన్న ఆర్చి వద్ద కొంత సేపు పాటలు పాడుకుంటూ పక్కకు ఒరిగిపోయాడు. సమీపంలోని కొబ్బరి బోండాలు విక్రయించే వ్యక్తి వచ్చి అతన్ని లేపేందుకు ప్రయత్నించగా అతను లేవకపోవడంతో పక్కనే ఉన్న ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతోపాటుగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు


సదస్సులో మాట్లాడుతున్న సీఐ మురళీ కృష్ణ

సూళ్లూరుపేట రూరల్: మాదక ద్రవ్యాల (మత్తుమందు పదార్థాల) వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు మంగళవారం సీఐ మురళీ కృష్ణ అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, అందుకు పడేశిక్షలపై పట్టణంలోని ప్రతిభ డిగ్రీ కళాశాల, మంగళంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఐ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్ఐలు బ్రహ్మనాయుడు, స్వప్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సైదాపురం: ఐసీడీఎస్ రాపూరు ప్రాజెక్టులోని సైదాపురం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఊటుకూరు-2 ఎస్సీ, పిల్లగాని ఓసీ (జనరల్), చావలిప్ప ఎస్టీ, గిద్దలూరు-2 ఓసీ (జనరల్) సెంటర్లలో అంగన్‌వాడీ హెల్పర్స్ ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ నేత (కౌన్సిలర్ విజయమ్మ భర్త) చిందేటి వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, వెంకటేశ్వర్లు బంధువులతో కలిసి శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గ మధ్యంలో ఆపిఉన్న కారును మరో కారు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వెంకటేశ్వర్లుతోపాటు ఆయన బంధువు పుల రాజేంద్ర గాయపడ్డారు. వీరిని నెల్లూరు వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేంద్ర కన్నుమూశారు. దీంతో ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన చిత్తూరు జిల్లాకు తరలించారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

ఓజిలి: సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బంది వెంకటేష్, భావన, రమణమ్మ, చందనను స్థానిక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బరావు యాదవ్ ఘనంగా శాలువాలతో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో టైపిస్ట్ రవీంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి కస్తూరయ్య పాల్గొన్నారు.

భూ పంపిణీ కోసం నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కలపాడు గ్రామస్తులు

వెంకటగిరి రూరల్ : భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య పేర్కొన్నారు. మండలంలోని కలపాడు గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ అండదండలు ఉన్న నాయకులు మాత్రం భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూమిలేని పేదలకు వెంటనే భూ పంపిణీ చేయాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలపాడు భూ పోరాట కమిటీ నాయకులు చెంచుకృష్ణయ్య, దారా కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. కుంటలో తేలి..


నీటి గుంటలో తేలియాడుతున్న మృతదేహం (ఇన్‌సెట్) చంద్రబాబు (ఫైల్)

వాకాడు: మండలంలోని కల్లూరు శివాలయం పక్కనే ఉన్న నీటి గుంటలో మంగళవారం ఓ మృతదేహం నీటిపై తేలాడుతూ ఉండడాన్ని అటు వెళ్లిన స్థానికులు గుర్తించారు. కొన్ని గుర్తుల ఆధారంగా ఈ మృతదేహం గ్రామానికి చెందిన బల్లి చంద్రబాబు గా స్థానికులతోపాటు కుటుంబ సభ్యులు గుర్తించారు. స్థానికుల కథనం మేరకు.. కల్లూరు గ్రామానికి చెందిన బల్లి చంద్రబాబు(42) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద అన్నం తిని ఇప్పుడే వస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి చంద్రబాబు ఇంటికి రాలేదు. ఏదైన అవసరమైన పని మీద బయట ప్రాంతాలకు వెళ్లాడేమోనని భార్య జ్యోతి అనుకుంది. ఎందుకంటే గతంలో కూడా చంద్రబాబు ఇంటి వద్ద చెప్పా పెట్టకుండా వెళ్లి, ఒకటి రెండు రోజుల తరువాత తిరిగొచ్చిన సందర్భాలున్నాయి. చంద్రబాబుకు గాలంతో చేపలు పట్టే అలవాటు ఉందని, ఈ క్రమంలోనే శివాలయం పక్కన గుంటలో తన గాలంతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ నాగబాబు, ట్రైనీ ఎస్ఐ కిరణ్, సిబ్బందితో మృతదేహాన్ని బయటకు తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వగ్రామం నాయుడుపేట మండలం వేముగుంట పాళెంకాగా ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి రూరల్: మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ వల్లూరు పెంచలయ్య, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వారు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కళారాణి

కలువాయి(సైదాపురం): అన్నదాత సుఖీభవ నగదు ఖాతాల్లో జమకాని రైతులు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి కళారాణి సూచించారు. మండలంలోని చీపినాపి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన నగదు జమ కానివారు మండలంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలోని రైతులకు పలు సూచనలు, సహాలు తెలియజేశారు.

నిందితుల అరెస్టు

పెళ్లకూరు: మండలంలోని పునబాక తూర్పుకండ్రిగ గిరిజన కాలనీకి చెందిన అమాస దుర్గా(27) ఆత్మహత్యకు కారణమైన నిందితులు నీలం వెంకటసుబ్బయ్య, నీలం మస్తానమ్మ, షేక్ అబ్దుల్ బాషాను మంగళవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి తల్లి అమాస వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచడంతో 15రోజులు రిమాండ్ విధించారు.

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు ఘనంగా వీడ్కోలు



ఆర్ముగం దంపతులకు వీడ్కోలు పలుకుతున్న అధికారులు, షార్ నూతన డైరెక్టర్‌తో యూనియన్ నాయకులు

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌కు జూలై 31 వరకు డైరెక్టర్‌గా పని చేసిన ఆర్ముగం రాజరాజన్ కేరళ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయనకు మంగళవారం షార్ అధికార యంత్రాంగం, ఇంజినీర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, అసోసియేట్ డైరెక్టర్ ఎస్ ముత్తు చెళియన్, కంట్రోలర్ ఎం శ్రీనివాసులురెడ్డి, షార్ డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పద్మకుమార్‌ను కలిసిన యూనియన్ నేతలు

షార్ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఈఎస్ పద్మకుమార్‌కు మంగళవారం షార్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి శివనాగిరెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్, శివకృష్ణ, సంయుక్త కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పద్మకుమార్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

చిల్లకూరు: మండలంలోని కమ్మవారిపాళెం సమీపంలో కొండుగుంట అటవీ ప్రాంతంలో పేకాడుతున్న 8 మందిని సోమవారం రాత్రి పట్టుకున్న పోలీసులు వారిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వేర్వేరు బృందాలు ఏర్పడిన పోలీసులు అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది నిందితులతోపాటు మూడు కార్లు, రూ.3.65 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ నిరంజన్‌కుమార్

చిట్టమూరు: మండలంలో ఎడగారులో రైతులు వరి పంటల సాగులో అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ పేర్కొన్నారు. ఆరూరు, చిట్టమూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఎడగారు పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.




వెంకటగిరి, డక్కిలి, గూడూరులో నిరసన తెలిపి, వినతి పత్రాలు అందజేస్తున్న వామపక్షాల నేతలు

స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలి

వెంకటగిరి రూరల్ /డక్కిలి/గూడూరురూరల్/ సైదాపురం: స్మార్ట్‌మీటర్లను రద్దు చేసి అన్ని రకాల విద్యుత్ చార్జీల భారం తగ్గించాలంటూ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వివి రమణయ్య, రైతు కూలీ సంఘం జిల్లా అధక్షులు డిపి పోలయ్య డిమాండ్ చేశారు. ఆయా ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల వద్ద, గూడూరు సచివాలయం వద్ద మంగళవారం వామపక్షాల నేతల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక అధికారులకు వినతి పత్రాలు అందించారు.